క్లుప్తంగా

నేడు 'ఈస్టర్'

పామిడి: మండలంలోని అన్ని చర్చీల్లో ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ పండుగను ఆచరించనున్నారు. క్రీస్తు సర్వలోక పాపపరిహారార్థం శిలువలో తన ప్రాణం పెట్టి గుడ్‌ఫ్రైడే రోజున మరణించి, తిరిగి మూడో దినమైన ఆదివారం సజీవుడై లేచిన రోజును క్రైస్తవులు ఈస్టర్ (పునరుత్థాన) పండుగగా ఆచరిస్తారు. ఆరోజు భక్తిప్రపత్తులతో తన పునరుత్థానంతో నిత్య జీవం ప్రసాదించిన క్రీస్తును స్మరించుకుంటూ ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఇందులో భాగంగా స్థానిక సీఎస్ఐ చర్చిని మల్లెపూలతో అలంకరించడం విశేషం.

సజావుగా వేలం



వంకరాజుకాలువ గ్రామ ఆలయ భూముల వేలం దృశ్యం

పామిడి: మండలంలోని వంకరాజుకాలువ గ్రామంలోని ఆంజనేయ, చెన్నకేశవ, భైరవస్వామి ఆలయాలకు సంబంధించిన భూములకు శనివారం కౌలు వేలం నిర్వహించారు. గుత్తి ఈఓ నాగేంద్రుడు ఆధ్వర్యంలో పామిడి దేవదాయశాఖ ఈఓ క్రిష్ణయ్య సమక్షంలో 45.06 ఎకరాల దేవాలయ భూములకు నిర్వహించిన వేలం రూ.1,26,200 పలికింది. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.76,100 అధికంగా వచ్చిందని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో సుబ్రమణ్యం, సుబ్బారెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

'సమైక్య భవనం నిర్మించండి'

శింగనమల: మండలంలోని దివ్యాంగుల సమైక్య భవనానికి స్థలం కేటాయించి, భవనం నిర్మించాలని మండలంలోని దివ్యాంగులు కోరారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. దివ్యాంగుల మండల అధ్యక్షుడు నారాయణ మాట్లాడుతూ మండలంలో దివ్యాంగులు 300 మంది ఉన్నారని, రామాలయంలో సమావేశం నిర్వహించుకుంటున్నామన్నారు. భవనం లేకపోవడంతో ఇక్కట్లు పడుతున్నామని, అందువలన మండల సమైక్యకు స్థలం కేటాయించి, భవనంను నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో దివ్యాంగులు ఆదినారాయణ, బాలిరెడ్డి, సుబ్బమ్మ, కుల్లాయమ్మ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



ఈజీ మార్ట్ ద్వారా నమోదు చేసుకున్న వారికి బోర్డులను అందజేస్తున్న ఎమ్మెల్యే

పుట్లూరు: స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే బండారు శ్రావణి తెలిపారు. శనివారం ఆమె మండలకేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో సెర్ప్, ఈజీ మార్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈజీ మార్ట్ ద్వారా పాత కిరాణా షాపు నిర్వాహకులు రూ.30 వేలు, కొత్త కిరాణా షాపు నిర్వాహకులు రూ.50వేలు చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. అలా నమోదు చేసుకున్న వారికి ఈజీ మార్ట్ ద్వారా తక్కువ ధరలో సరుకులను అందించి గ్రామాల్లో మహిళలకు ఆదాయం చేకూర్చుతామన్నారు. పుట్లూరు మండలంలో 21 షాపులకు గాను రూ.4.45 లక్షలు చెల్లించారన్నారు. కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రికార్డుల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ

గుత్తి రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ శ్రీనివాస్ తనిఖీ నిర్వహించారు. శనివారం డీఎల్‌డీఓ విజయలక్ష్మితో కలిసి కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రెవెన్యూ పరమైన సమస్యలను గురించి ఆర్డీఓ ఆరా తీశారు. ప్రజల నుంచి అందిన స్పందన ఫిర్యాదులకు గడువులోగా పరిష్కారం చూపుతున్నారా లేదా అని విచారించారు. స్పందనలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు పరిష్కారం చూపలేని పక్షంలో ఎందుకు వాటిని తిరస్కరిస్తున్నామో స్పష్టమైన సమాధానం ఇవ్వాలని ఆర్డీఓ రెవెన్యూ సిబ్బందికి సూచించారు. ఇప్పటి వరకూ ఎన్ని స్పందన వినతులు పెండింగ్‌లో ఉన్నాయి అని విచారించారు. అలాగే కార్డుదారుల నుంచి వేలిముద్రల సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఓబిలేసు, డీటీ లలితమ్మ, సీఎస్‌డీటీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

శింగనమల: మండలంలోని గురుగుంట్ల గ్రామంలో శుక్రవారం రాత్రి వరకూటి నాగలక్ష్మి మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు దాసరి వెంకటరమణ శనివారం గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం ఆమె భర్త వరకూటి పెద్ద ఆంజనేయులుకు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

ఇక్కడ అందరూ ఇన్‌చార్జ్‌లే!

- రెగ్యులర్ అధికారులు లేక ఇబ్బందులు
- యల్లనూరు మండలంపై అధికారుల సవతి ప్రేమ
- అవస్థల్లో మండలవాసులు



తహసీల్దార్ కార్యాలయం



పశు సంవర్ధకశాఖ కార్యాలయం

యల్లనూరు: మండలంలోని అన్ని కీలక శాఖల్లోనూ ఇన్‌చార్జ్ అధికారులు కొనసాగుతున్నారు. దీంతో సమస్యల పరిష్కార నిమిత్తం యల్లనూరుకు వచ్చే ప్రజలకు సంబంధిత అధికారులు లేకపోవడంతో పలుమార్లు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇన్‌చార్జ్‌ల పాలన మొదలైంది. దీంతో ప్రజలు బేజారుపడుతున్నారు. కీలకశాఖల్లో అధికారులు లేక ప్రగతి లక్ష్యాలు కుంటుపడుతున్నాయి.

ఖాళీల వివరాలు ఇలా..

తహసీల్దారు, డిప్యూటీ తహసీల్దారు, ఎంపీడీఓ, వెటర్నరీ ఏడీ, ఉద్యాన అధికారి, ఇరిగేషన్ జేఈ, ఏపీఓ, ఏయస్ఓ, తిమ్మంపల్లి అంగన్వాడీ సూపర్‌వైజర్ తదితర శాఖల అధికారులు ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు.

- యల్లనూరు తహసీల్దారుగా నాగరాజు బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం గుండె నొప్పి సమస్యతో సెలవు పెట్టారు. కొన్ని రోజులు పుట్లూరు తహసీల్దారు శేషారెడ్డికి యల్లనూరు అదనపు బాధ్యతలను ఉన్నతాధికారులు అప్పగించారు. ఆయనకు రెండు మండలాల పర్యవేక్షణ కష్టంగా మారడంతో సీఎస్‌డీటీగా విధులు నిర్వహిస్తున్న రాజాకు తహసీల్దారుగా ఎఫ్ఏసీ బాధ్యతలను అప్పగించారు. తిరుమలాపురం రేషన్ షాపును ఓ టీడీపీ నేతకు ఇవ్వాలని, లేనిపక్షంలో సెలవులో వెళ్లాలని స్థానిక ఎమ్మెల్యే ఆదేశించడంతో టీడీపీ నేత దౌర్జన్య కాండతో రాజా సెలవు పెట్టాడు. మళ్లీ తిరిగి పుట్లూరు రెగ్యులర్ తహసీల్దార్‌కు అదనపు బాధ్యతలను అప్పగించారు. రెగ్యులర్ డిప్యూటీ తహసీల్దారు బాషా దీర్ఘకాలిక సెలవులో ఉండటంతో ఆస్థానాన్ని రీ సర్వే డీటీకి రెగ్యులర్ బాధ్యతలను అప్పగించారు. సీనియర్ అసిస్టెంట్ పోస్టు మూడు నెలలుగా ఖాళీగా ఉంది.
- మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా సౌజన్యలక్ష్మిని నియమించారు. అయితే ఆమె అనంతపురంలోనే డీపీఆర్సీలోనే కొనసాగుతున్నారు. ఆ స్థానాన్ని ఏఓగా విధులు నిర్వహిస్తున్న వాసుదేవరెడ్డికి ఇన్‌చార్జి ఎంపీడీఓ బాధ్యతలను అప్పగించారు. దీంతో ఆయనకు అదనపు భారం పడింది. ఇక్కడ పనిచేస్తున్న ఏపీఓ షబ్బీర్ బాషా ఇటీవల బదిలీల్లో భాగంగా వైఎస్సార్ జిల్లా చక్రాయపేటకు వెళ్లారు. ఇంకా ఏపీఓగా ఎవ్వరినీ నియమించలేదు.
- యల్లనూరు రెగ్యులర్ వెటర్నరీ ఏడీగా మురళీ నాలుగు నెలల కిందట బాధ్యతలు తీసుకున్నారు. వెంటనే ఆయన సెలవుపై వెళ్లారు. తిరుపతిలో నివాసం ఉండటంతో ఆయన యల్లనూరుపై ఆసక్తి చూపడం లేదు. అలాగే బుక్కాపురం వెటర్నరీ వైద్యురాలు సువర్ణకు ఉన్నతాధికారులు పుట్లూరు వెటర్నరీ ఆస్పత్రి బాధ్యతలను అప్పగించారు.
- ఉద్యాన శాఖ అధికారి శైలజ ను శింగనమల, బుక్కరాయసముద్రం హెచ్ఓగా బదిలీ చేశారు. ఆ స్థానాన్ని తాడిపత్రి హెచ్ఓ ఉమాదేవికి అదనపు బాధ్యతలను అప్పగించారు. ఈమె అటు తాడిపత్రికి.. ఇటు యల్లనూరు మండలానికి న్యాయం చేయలేకున్నారు.
- తిమ్మంపల్లి సెక్టారుకు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పోస్టుకు యల్లనూరు సూపర్‌వైజర్ రాజామణికి అదనపు బాధ్యతలను అప్పగించారు.
- యల్లనూరు స్పెషల్ బ్రాంచి పోలీసుగా ఓబులేసు సత్యసాయి జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో యల్లనూరులో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డికి ఆ బాధ్యతలను అప్పగించారు. తాడిపత్రికి విష్ణువర్ధన్‌రెడ్డి బదిలీ అవడంతో ఆస్థానాన్ని పుట్లూరు స్పెషల్ బ్రాంచి కానిస్టేబుల్ ధనుంజయకు అప్పగించారు. యల్లనూరుకు ఇప్పటి వరకూ రెగ్యులర్ స్పెషల్ బ్రాంచి కానిస్టేబుల్ లేకపోవడం గమనార్హం. ఇలా యల్లనూరు మండలంలో అన్ని పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఇన్‌చార్జిలతో నెట్టుతున్నారు.

ఇన్‌చార్జ్‌లతో ఇబ్బందులు



కీలకశాఖలైన రెవెన్యూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండటం లేదు. దీంతో చాలామంది రైతులు అయోమయంలో ఉన్నారు. కనీసం ఏఏ తేదీల్లో తహసీల్దారు వస్తున్నారో....రాలేదో ....నోటీస్ బోర్డులో పెడితే రైతులు చదువుకుని ఆయా తేదీల్లో కార్యాలయాలకు వస్తారు. రెగ్యులర్ తహసీల్దారు, డీటీ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లేక భూ సమస్యలు పరిష్కారం కావడం లేదు.

– భోగతి ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం

మండలంలో తహసీల్దారు, డిప్యూటీ తహసీల్దారు, సీనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నమాట వాస్తవమే. ఇన్‌చార్జి పాలనతోనే సాగిస్తున్నాం. సీసీఎల్ఏలో పదోన్నతులు రావాల్సి ఉంది. అప్పుడు అన్ని పోస్టులూ భర్తీ చేస్తాం. సమస్యను గతంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. మరోసారి కలెక్టరుతో విషయాన్ని చెప్పి సమస్యను పరిష్కరిస్తాం.

– కేశవనాయుడు, ఆర్డీఓ అనంతపురం

ఉద్యాన పంటల సాగుకు రాయితీ

గుత్తి రూరల్: ఉద్యాన పంటలు సాగు చేసే రైతులు రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని గుత్తి డివిజన్ ఉద్యానశాఖ అధికారిణి మిత్రవింద మాధవి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో గుత్తి, గుంతకల్లు, పామిడి, పెద్దవడుగూరు మండలాల్లో ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు ఉద్యానశాఖ ద్వారా మామిడి, బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్, ద్రాక్ష, అల్లనేరుడు, అవకాడో పూలమొక్కలను రాయితీపై అందిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే చీనీ, దానిమ్మ, అరటి పంటలకు ఉద్యానశాఖలో పంట రాయితీ పొందడానికి అర్హులన్నారు.అలాగే ఫారం పాండ్లు, ఫారంగేటు, తైవాన్ స్ప్రేయర్లు, ట్రాక్టర్ స్ప్రేయర్లను కూడా రైతులకు రాయితీపై మంజూరు చేస్తామన్నారు. ఆసక్తి ఉన్న రైతులు రైతు సేవా కేంద్రం లేదా ఉద్యానశాఖ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

దుకాణాలు, హోటళ్లలో తనిఖీలు



హోటల్ నిర్వాహకుడి నుంచి జరిమానా వసూలు చేస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని తాడిపత్రి రోడ్డు, అనంతపురం రోడ్డులో పలు దుకాణాలు, హోటళ్లలో సచివాలయ ఉద్యోగులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ విక్రయిస్తున్న, వాడుతున్న హోటళ్ల, దుకాణాల నిర్వాహకులపై రూ. 500 నుంచి రూ. 1000 దాకా జరిమానా విధించారు. ఈ సందర్భంగా సచివాలయ హెల్త్ అసిస్టెంట్ మల్లికార్జున మాట్లాడుతూ పట్టణంలో ఇక నుంచి ప్లాస్టిక్‌ను విక్రయించినా, వాడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైభవంగా రన్ ఫర్ జీసస్



తాడిపత్రిలో పాల్గొన్న క్రైస్తవులు



గుంతకల్లులో మాట్లాడుతున్న పాస్టర్ ప్రతాప్‌రెడ్డి



గుత్తిలో రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడిపత్రి రూరల్/గుంతకల్లు/గుత్తి: తాడిపత్రి పట్టణంలో శనివారం సుంకులమ్మ పాలెం సీఎస్ఐ చర్చి నుంచి నంద్యాలరోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్, సీబీ రోడ్డు మీదుగా నందలపాడులోని రైల్వే స్టేషన్ వద్ద గల చర్చి వద్దకురన్ ఫర్ జీసస్ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున క్రైస్తవులు హాజరయ్యారు.

- గుంతకల్లులో పట్టణ యునైటెడ్ క్రిస్టియన్ వెల్ఫేర్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం రన్ ఫర్ జీసస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌సీఎం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు అనంతరం రన్ ఫర్ జీసస్ ర్యాలీ ప్రారంభమైంది. ర్యాలీ రైల్వేస్టేషన్ రోడ్డు, ప్రధాన రహదారి, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా ఎస్పీజీ చర్చి వద్ద ముగించారు. కార్యక్రమంలో ఫోరం అధ్యక్షుడు ఫాదర్ ప్రతాప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సాల్మోన్ విజయరాజ్ తదితరులు పాల్గొన్నారు.
- గుత్తి, గుత్తి ఆర్ఎస్‌లలో శనివారం సీఎస్ఐ చర్చిల పాస్టర్లు సాల్మన్ బాబు, డేవిడ్ నాయక్, ఎంఎస్ హైస్కూల్ కరస్పాండెంట్ రస్సెల్ కిరణ్, క్రిస్టియన్ యూత్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీలో వందలాది మంది క్రైస్తవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ఐ చర్చిలో పాస్టర్లు, చర్చి కమిటీ సభ్యులు, క్రిస్టియన్ యూత్ సభ్యులు ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఏసు ప్రభువు సర్వ మానవాళి సంక్షేమం కోసం తిరిగి ఈ భూమ్మీద జన్మించాడన్నారు. ప్రతి ఒక్కరూ ఏసయ్యను స్మరించాలన్నారు. కార్యక్రమంలో చర్చి కమిటీ సెక్రటరీ సురేంద్ర బాబు, కోశాధికారిణి మనోరంజిత, బింగి కిరణ్ బాబు, హెచ్ఎం కిరణ్, పాస్టర్లు కన్నయ్య, గాబ్రియేల్, ప్రసాద్, అనిల్ కుమార్, సుధాకర్, రాజేష్, రవి, పాల్, మత్తయ్య, ప్రభాకర్, చంద్రసేన,సి. ప్రసాద్, గుత్తి , గుత్తి ఆర్ఎస్ సంఘ కాపరులు, సంఘ పెద్దలు, స్త్రీల మైత్రి సంఘాలు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత స్మరణలో మహిళకు స్వర్ణ పతకం



ఉమ

పామిడి: మైసూరు దత్తపాదుకాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహించిన సంపూర్ణ భగవద్గీత స్మరణలో పట్టణానికి చెందిన రైల్వే ఉద్యోగి చింతబరి భార్య ఎ.ఉమ స్వర్ణపతకం సాధించింది. ఈసందర్భంగా దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామిజీ, ఉత్తర పీఠాధిపతి విజయానంద తీర్థ స్వామీజీ చేతులమీదుగా ఆమె స్వర్ణ పతకంతో పాటు ప్రశంసా పత్రం పొందారు. శనివారం ఆమెను స్థానిక దత్తపాదుకా క్షేత్రం కమిటీ నిర్వాహకులు ఎంహెచ్ లక్ష్మీనారాయణరెడ్డి, ఎస్ఎస్ఎం శ్రీధర్, కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు. అలాగే వచ్చే మే 26న గణపతి సచ్చిదానంద స్వామీజీ జన్మ దినాన్ని పురస్కరించుకుని మే 20న 1వ తరగతి నుంచి 10 వ తరగతి వరకూ మూడు విభాగాలుగా నిర్వహించే భగవద్గీత శ్లోకాల పోటీలకు ఈనెల 20వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని వారు సూచించారు. మరింత సమాచారం కోసం 9505124029, 9603604537 నంబర్లలో సంప్రదించాలన్నారు.

మహిళ అదృశ్యం



రామాంజనమ్మ

బుక్కరాయసముద్రం: మండలంలోని రేకులకుంట గ్రామంలో ఓ మహిళ మిస్సింగ్ అయిన సంఘటన వెలుగు చూసింది. సీఐ పుల్లయ్య తెలిపిన వివరాల మేరకు.. రేకులకుంటకు చెందిన రామాంజినమ్మ ఈ నెల 18న రాత్రి ఇంటి నుంచి తప్పిపోయింది. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. మహిళ ఆచూకీ తెలిసిన వారు 9450796816కు సమాచారం ఇవ్వాలన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి



బీకేఎస్‌లో సీమంతం నిర్వహిస్తున్న సీడీపీఓ ఉమా శంకరమ్మ

బుక్కరాయసముద్రం: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ ఉమా శంకరమ్మ సూచించారు. శనివారం బీకేఎస్‌లో పౌష్టికాహారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లిలో 'పోషణ పక్షోత్సవం'

పామిడి: పామిడి సెక్టార్‌కు సంబంధించి మండలంలోని తంబళ్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గుత్తి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి గుత్తి ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ సీడీపీఓ భారతి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మహిళలు, బాలింతలు, గర్భిణులను ఉద్దేశించి మాట్లాడారు. తక్కువ ఖర్చుతో లభించే ఆకుకూరలు, కూరగాయల్లో పోషక విలువలు అధికంగా లభిస్తాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో లభించే పౌష్టికాహారాన్ని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా తల్లీబిడ్డల సంరక్షణపై సీడీపీఓ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వాటర్ ఫిల్టర్ వితరణ

గార్లదిన్నె: మండలంలోని జెడ్పీ హైస్కూల్ బయోసైన్స్ సబ్జెక్టు టీచర్‌గా పని చేస్తున్న సుజాత ఆమె తండ్రి రామాచారి పేరు మీద రూ.25 వేలు విలువ చేసే వాటర్ ఫిల్టర్‌ను ఉచితంగా అందజేశారు. పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల సౌకర్యార్థం ఫిల్టర్ అందజేశామన్నారు. సుజాతను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

టీనేజీ ప్రెగ్నెన్సీపై అవగాహన

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పరిధిలోని మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలలో శనివారం విద్యార్థులకు టీనేజీ ప్రెగ్నెన్సీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సుమన్ చిన్న వయస్సులో పెళ్లి చేసుకొని గర్భం దాల్చడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, హెల్త్ ఎడ్యుకేటర్ సుబ్రమణ్యం, సూపర్‌వైజర్ నాగరత్న, హెల్త్ అసిస్టెంట్ కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో మహిళ మృతి

గుంతకల్లు రూరల్: మండలంలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన రంగమ్మ (45) అనే మహిళ శనివారం సాయంత్రం గుండెపోటుతో మృతిచెందారు. శనివారం సాయంత్రం ఛాతీలో మంటగా ఉండటంతో ఆమెను వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు ఆమెను అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. ఆమెకు భర్త రామాంజనేయులు, కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు.

రైతుల నోట్లో మట్టి కొడుతున్న 'కూటమి'

గుంతకల్లు రూరల్: కళ్లబొల్లి హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రైతులను విస్మరించి, వారి నోట్లో మట్టి కొడుతోందని వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి విమర్శించారు. శనివారం గుంతకల్లు మండలంలోని పాతకొత్తచెరువు గ్రామంలో రైతులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు ఏటా రూ.20 వేలు అందజేస్తామని హామీ ఇచ్చినా.. ఇప్పటివరకూ హామీ అమలు చేసిన పాపాన పోలేదన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేయకపోతే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

పరిసరాల శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



తాడిపత్రి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



గుంతకల్లు మున్సిపల్ ఆఫీసులో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ నయీమ్ అహ్మద్



గుత్తిలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్/తాడిపత్రి రూరల్/గుంతకల్లు టౌన్/గుత్తి/గుత్తి రూరల్/పామిడి/యాడికి/పెద్దవడుగూరు/యల్లనూరు: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని వక్తలు సూచించారు. తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో శనివారం ప్రజాప్రతినిధులు, అధికారులు స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ ఈ వేస్ట్ మెటీరియల్‌ను రీసైకిల్ చేయాలని సూచించారు. స్వచ్ఛాంధ్ర స్థాపనకు కృషి చేస్తామని ఉద్యోగుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఇళ్లలోని, దుకాణాల్లోని ఈ వేస్టేజీ(చెడిపోయిన ఎలక్ట్రికల్ పరికరాలు) మున్సిపల్ కార్యాలయంలో లేదా సచివాలయాల్లో అందజేయాలని సూచించారు.

- తాడిపత్రి పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణను ఎస్ఐ గౌస్‌బాషాతో పాటు సిబ్బంది శుభ్రం చేసారు. అనంతరం మొక్కలు నాటారు. ప్రతి మూడో శనివారం స్టేషన్‌లో స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే పట్టణంలోని రజకవీధి సచివాలంలో నిర్వహించిన స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పాల్గొన్నారు స్వచ్ఛ దినస్ సందర్భంగా చేపట్టిన కార్యక్రమాలను ఆయనకు కమిషనర్ శివరామక్రిష్ణ వివరించారు. అంతకు మునుపు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.
- గుంతకల్లులో నిర్వహించిన స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ నయీమ్ అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కాలేజీలో ఈ-వేస్ట్ పునర్వినియోగం, రీసైక్లింగ్ చేసే విధానాలపై ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య విద్యార్థులకు వివరించారు.
- గుత్తిలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, టీడీపీ నాయకులు, మున్సిపల్ మేనేజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా, సచివాలయ , మున్సిపల్ ఉద్యోగులు,సిబ్బంది పాల్గొన్నారు. అలాగే బేతాపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, కార్యదర్శి సాదిక్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.
- యాడికిలో నిర్వహించిన స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఎంపీడీఓ వీర్రాజు , రాయలచెరువు గ్రామ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు
- పెద్దవడుగూరు మండలంలో నిర్వహించిన స్వచ్ఛ కార్యక్రమంలో ఎంపీడీఓ బారెన్‌సాహెబ్ సర్పంచ్ వరలక్ష్మి, జెడ్పీ పాఠశాల విద్యార్థులు, పంచాయితీ కార్యదర్శులు, కార్మికులు సిబ్బంది పాల్గొన్నారు.
- పామిడి లో ఎంపీడీఓ తేజోత్స్న ఆధ్వర్యంలో ఈఓ ఎం గోపాల్ సారథ్యంలో గ్రామసభ చేపట్టారు. ఈసందర్భంగా ఈ-వేస్ట్ నిర్వహణపై వారు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయితీ, సచివాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
- యల్లనూరు మండలంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వాసుదేవరెడ్డి, ఈఓఆర్డీ మనోహర్‌బాబు, హెల్త్ సూపర్‌వైజర్ హాజీవలి, ఏఎన్ఎం శ్రీదేవి, జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు, తదితరులు పాల్గన్నారు.

తక్కువ నీటితో ఉద్యాన పంటల సాగు

గార్లదిన్నె: రైతులు తక్కువ నీటి వనరులు ఉన్నా.. డ్రిప్పు స్ప్రింక్లర్ల ద్వారా ఉద్యాన పంటలు సాగు చేసుకోవచ్చని మైక్రో ఇరిగేషన్ పీడీ రఘునాథ్‌రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని ఎర్రగుంట్లలో డ్రోన్ సర్వేను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎర్రగుంట్ల రెవెన్యూ గ్రామంలో 1,355 బత్తాయి తోటలను జీపీఆర్ఎస్ ట్రాకింగ్ చేసి డ్రోన్ సర్వేకు కావలసిన సమాచారాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. సూక్ష్మనీటి సాగు పథకంలో పని చేస్తున్న ఎఫ్‌సీఓలు, మైక్రో ఇంజినీర్లు, డీసీఓలు తదితరులు పాల్గొన్నారు.

యాంత్రీకరణ పరికరాల పంపిణీ

పామిడి: పామిడి, గుత్తి మండలాలకు సంబంధించి శనివారం గుత్తి మార్కెట్ యార్డులో సబ్సిడీ వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను రైతులకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పంపిణీ చేశారు.